సర్పాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళి 2





84 వేలకు పైగా ఓట్లు ఔట్ 2





AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com

18-8-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## మొక్కలను నాటి సంరక్షించాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనెలహారి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ పరిధిలో 2వ వార్డులో మొక్కలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మొక్కలతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని ప్రతిఒక్కరూ తమ ఇళ్ల ముందు మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నర్మే నవీన్, శాల ప్రసాద్, ఎస్‌కే బబ్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కొత్తవారికే 'సహకారం'!

- ఎన్నికలకు స్వస్తి
- నామినేటెడ్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం
- గతంలో పనిచేసిన డైరెక్టర్లు, ఛైర్మన్లకు నో ఎంట్రీ

**తెలంగాణలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలికింది. ఎన్నికల నిర్వహణకు బదులుగా పూర్తిగా నామినేటెడ్ పద్ధతిలో పాలక మండళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అంతేగాకుండా పాలకవర్గాల్లో పూర్తిగా కొత్తవారికి మాత్రమే అవకాశం ఇవ్వనుంది గత పాలకవర్గంలో పనిచేసిన డైరెక్టర్లు, ఛైర్మన్లకు మళ్లీ అవకాశం లేకుండా ప్రభుత్వం కొత్త నిబంధనలు అమలు చేయనుంది.**

**- అక్షరటుడే, ఎల్లారెడ్డి**

ప్రాథమిక సహకార సంఘాల కార్యవర్గాలను త్వరలో నియమించడానికి ప్రభుత్వం సిద్ధం అవుతోంది. దీంతో పదవులు ఆశిస్తున్న కాంగ్రెస్ నాయకులు నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డైరెక్టర్ పదవులు దక్కించుకునేందుకు ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల, వ్యక్తిగత సహాయకులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘాల ఎన్నికలు రాజకీయంగా, ఆర్థికంగా తీవ్ర ప్రభావం చూపుతుంటాయి. డైరెక్టర్ పదవుల నుంచి ఛైర్మన్ స్థానం వరకు ప్రతి ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారుతుంది. భారీగా డబ్బు ఖర్చు, రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో ప్రభుత్వం ఎన్నికలను రద్దు చేసింది. ఏఎంసీల తరహాలో పాలకమండళ్లు నియమించనుంది.

### 13 మందితో పాలకవర్గం

సహకార చట్టం ప్రకారం ప్రతి పీఏసీఎస్‌కు 13 మందితో కూడిన పాలకవర్గం ఉంటుంది. ఇందులో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ తో పాటు 11 మంది డైరెక్టర్లు ఉంటారు. నామినేటెడ్ పద్ధతిలో 2 లేదా 3 స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించి తప్పనిసరిగా భర్తీ చేయాల్సి ఉంటుంది. మిగిలిన స్థానాలను జనరల్ కేటగిరీ కింద భర్తీ చేస్తారు.

### వారికే అవకాశం

నామినేటెడ్ విధానంలో ప్రభుత్వం కొన్ని కీలక నిబంధనలు పెట్టింది. సభ్యత్వం ఉన్నవారికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఎలాంటి బకాయిలు లేని రైతులకు ప్రాధాన్యం ఇవ్వనుంది. గతంలో పనిచేసిన డైరెక్టర్లు, ఛైర్మన్లు ఈసారి అనర్హులు అని పేర్కొంది. ప్రస్తుతం రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాలు పూర్తిగా నామినేటెడ్ విధానంలోనే అమలు అవుతున్నాయి. ఇదే ఫార్ములాను పీఏసీఎస్ లకు కూడా వర్తింపజేయనున్నారు.




### ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 144 సహకార సంఘాల్లో 1,872 డైరెక్టర్ పదవుల భర్తీ కానున్నాయి. ఎన్నికలు లేకుండా నేరుగా పదవులు రావడంతో అధికార పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. పదవుల కోసం ఆశావాహులు స్థానిక ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. హైదరాబాద్ వరకు వెళ్లి పైరవీలు చేస్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పదవులు దక్కలేదనే అసంతృప్తితో ఉన్న క్యాడర్ కు ఈ కీలక పదవుల ద్వారా గ్రామీణ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ యోచిస్తోంది. ఈ పదవులన్నీ ఎమ్మెల్యేలు, వారి ముఖ్య అనుచరులు.. వ్యక్తిగత సహాయకుల సిఫారసు మేరకే భర్తీ అవుతాయని సమాచారం. కామారెడ్డి జిల్లాలో మొత్తం 55 సహకార సంఘాలు ఉన్నాయి. ఇప్పటికే 10 విండోలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. వాటిలో రెండు విండోలకు పాలకవర్గాల నియామక ఉత్తర్వులు కూడా వచ్చాయి.



## పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తే ఉద్యమిస్తాం


**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పాలిటెక్నిక్ కళాశాలలను 'శక్తి శాఖ'లో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పాలిటెక్నిక్ కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నాకు దిగారు. రఘురాం నాయక్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అని అన్నారు. దీనిని శక్తి శాఖలో కలపటం వలన విద్యావ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద, మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లొమా విద్య అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని రఘురాం డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్.97ను ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రంలో సాంకేతిక విద్యా మండలిని విశ్వవిద్యాలయంగా అప్‌డేట్ చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో అందుకు మంత్రివర్గం ఉపసంఘం పచ్చజెండా ఊపిందన్నారు. తాజాగా ఐటీఐలు, ఏటీసీలు పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చేర్చాలని సర్కార్ నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం సాంకేతిక విద్యాశాఖతో ఆటలాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన పాలసీ ద్వారా విద్యార్థులు కార్మికులుగా మారే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ ఆలోచనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని లేకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కిషోర్, అజేష్, రామ్ చరణ్, నీరజ్, నాగేష్, శివ పవన్, కిషోర్, భాను, విష్ణు, మహేందర్ పాల్గొన్నారు.

## కామారెడ్డికి యంగ్ ఇండియా స్కూల్ మంజూరు






**అక్షరటుడే, కామారెడ్డి:** ఈ నెల 11న 'యంగ్ ఇండియా స్కూల్ కలేనా' శీర్షికతో 'అక్షరటుడే'లో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. నియోజకవర్గానికి స్కూల్ మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలన ఉత్తర్వులు జారీ చేసింది. భిక్కనూర్ మండల కేంద్రంలో సర్వే నంబ.ర్ 671లో 20 ఎకరాల స్థలం అధికారులు కేటాయించగా ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్ల నిధులు సైతం కేటాయించింది. ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందాలన్న ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి యంగ్ ఇండియా పాఠశాలల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. నియోజకవర్గానికి రూ.200 కోట్ల వ్యయంతో పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. భిక్కనూర్ మండల కేంద్రంలో 20 ఎకరాల్లో పాఠశాల నిర్మాణం జరుగుతుందన్నారు. మొత్తం నాలుగు బ్లాకులుగా నిర్మాణం జరుగుతుందని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు బ్లాకులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. మధ్యలో విశాలమైన మైదానం ఉంటుందని, అన్ని రకాల గేమ్స్ అందుబాటులో ఉంటాయన్నారు. కామారెడ్డికి గోదావరి జలాల పనుల తర్వాత ఇంత పెద్ద మొత్తం నిధులు మంజూరు కావడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, భిక్కనూర్ సర్పంచ్ బల్యాల రేఖ, అదనపు కలెక్టర్ ఎన్.వై గిరి, జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్ పాల్గొన్నారు.



## పచ్చని ప్రకృతిలో పురివిప్పిన మయూరం

**పచ్చని ప్రకృతిలో పురివిప్పిన ఈ మయూరం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. దట్టమైన వనంలో తన పించాన్ని హరివిల్లుగా విప్పి, రాజసంతో నిలబడిన ఈ దృశ్యం ఎల్లారెడ్డి శివారులో 'అక్షరటుడే' కెమెరాకు చిక్కింది. ప్రకృతి అందాల మధ్య పురి విప్పిన మయూరాన్ని ఆ దారి వెంట వెళ్లిన వాహనదారులు ఆసక్తిగా చూశారు.**

**– సిద్దు గౌడ్, అక్షరటుడే ఎల్లారెడ్డి**

## సీఎం రేవంత్ రెడ్డిని పడగొట్టేది ఎమ్మెల్యేలే : బాజిరెడ్డి గోవర్ధన్

**అక్షరటుడే, బాన్సువాడ:** కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ప్రభుత్వ వైఫల్యాలతో గ్రామాల్లో తిరిగే పరిస్థితి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బాన్సువాడ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై ప్రజలు ఎమ్మెల్యేలను నిలదీస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం చెప్పిన విధంగా సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ఆరోపించారు. ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతతో చివరకు ఎమ్మెల్యేలే సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని పడగొట్టేది ఎమ్మెల్యేలే అని బాజిరెడ్డి గోవర్ధన్ వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేయడం లేదన్నారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిపై కూడా ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో బీఆర్ఎస్‌లో ఉండి, ప్రభుత్వం మారిన అనంతరం కాంగ్రెస్‌లో చేరారన్నారు. . రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీ మారారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, నిలిచిపోయిన సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీజీ గౌడ్, జుబేర్, శ్రీనివాస్ రావు, అంజిరెడ్డి, ధర్మతేజ, మోచి గణేష్, రమేష్ యాదవ్, శివ తదితరులు పాల్గొన్నారు.



## యూరియా కోసం రోడ్డెక్కిన రైతన్నలు



**అక్షరటుడే, గాంధారి:** సొసైటీకి వచ్చిన రైతులకు యూరియా లేదని పేర్కొనడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన వారు రోడ్డెక్కి ధర్నాకు దిగారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో రైతులు ఆన్‌లైన్‌లో యూరియా బుకింగ్ చేసుకున్నారు. అయితే ఇప్పటికే యాప్‌తో ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని యూరియా బుకింగ్ చేసుకుని గాంధారి సొసైటీకి వస్తే యూరియా లేదని అక్కడి సిబ్బంది చెప్పడంతో వారు ఆగ్రహించారు. తమకు యూరియా అందించాలని కామారెడ్డి -బాన్సువాడ ప్రధాని రహదారిపై సొసైటీ వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ధర్నాలో ఉన్న రైతులు మాట్లాడుతూ తమకు సకాలంలో ఎరువులు అందక ఇప్పటికే ఆగమవుతున్నామని వెంటనే బుకింగ్ చేసుకున్న యూరియాను అందించే వరకు కదిలేదని లేదని వారు భీష్మించుకు కూర్చున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించి ధర్నాను విరమింపచేశారు. అయితే ఈ సంఘటనపై వ్యవసాయ అధికారి రాజలింగంను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ స్విచ్ఆఫ్ రావడం గమనార్హం.

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** లింగనిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. కలెక్టరేట్ లో గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశం జరిగింది. లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం జిల్లా స్థాయి సలహా సంఘం ఆశించిన స్థాయిలో పనిచేయట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నామ్ కే వాస్తేగా సమావేశాలు నిర్వహించి తీర్మానాలు రాసుకోవడంతోనే సరిపెట్టుకోకుండా, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలపై క్షేత్ర స్థాయిలో గట్టి నిఘా ఉంచాలని అన్నారు. జనన వివరాలను అనుసరిస్తూ ఆడ, మగ నిష్పత్తిలో ఎక్కువ వ్యత్యాసం ఉంటే, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ, భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు భావించాల్సి వస్తుందన్నారు. ఈ తరహా వ్యత్యాసం ఎక్కువగా నగరాలు, పట్టణ ప్రాంతాలలోనే కనిపిస్తోందని, దీనిని బట్టి గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు తెలుస్తోందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో గట్టి నిఘా ఉంచితే ఈ తరహా ఘటనలకు ఆస్కారం ఉండదని తెలిపారు. ఎన్ని కఠిన చట్టాలు ఉన్నా, వాటి అమలు సక్రమంగా లేకపోతే ఎలాంటి ప్రయోజనం ఉండదని కలెక్టర్ అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇకపై జిల్లాలో ఎక్కడ కూడా లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు జరుగకుండా నిఘా పెట్టాలన్నారు. గర్భం దాల్చిన నాటి నుండి గర్భిణుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని, వారిలో ఎంతమందికి కాన్పు జరిగిందన్నది పరిశీలించాలన్నారు. గర్భం దాల్చిన మీదట కాన్పు జరగని కేసులను క్షుణ్ణంగా పరిశీలిస్తే, గర్భ నిర్ధారణ, గర్భ విచ్ఛిత్తి ఘటనలను గుర్తించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, కమిటీ సభ్యులు ఎస్.సిద్దయ్య, బి.ఆంజనేయులు పాల్గొన్నారు.

## పెద్దకొడప్‌గల్‌లో బీఆర్ఎస్ ధర్నా



**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడాన్ని నిరసిస్తూ పెద్దకొడప్‌గల్ గాంధీచౌక్ వద్ద మాజీ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆసరాగా నిలిచిన ఈ పథకాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తొలగించాలని చూడటం సరైంది కాదన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే తీవ్ర స్థాయిలో నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు సతీష్ యాదవ్, బుసప్ప పటేల్, బన్సీలాల్, గోవింద్ రెడ్డి, మహమ్మద్, నర్సు పటేల్, సర్పంచులు రాజేందర్, సాయ గౌడ్, నాయకులు సంజీవ్, సుధీర్, అశోక్, సురేందర్, అశోక్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఖేలో ఇండియాలో యోగా సిలబస్ మార్చాలి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఖేలో ఇండియా యోగా పోటీల సిలబస్‌ను మార్చాలని తెలంగాణ యోగా అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి మంగళవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దేశంలో 1974 నుండి యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలు నిర్వహిస్తుందని నాగిరెడ్డి సిద్ధారెడ్డి తెలిపారు. అయితే యోగాకు సంబంధం లేని కొంతమంది దొడ్డి దారిన ఆయుష్ డిపార్ట్‌మెంట్ ద్వారా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అఫిలియేషన్ పొందినట్లు చెప్పారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే భారతీయ సంస్కృతితో ముడిపడి ఉన్న యోగా పోటీలను ఖేలో ఇండియాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. సిలబస్‌తో పాటు అఫిలియేషన్ విషయాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖతో మాట్లాడనున్నట్లు కేంద్రమంత్రి బండి సంజయ్ వారికి హామీ ఇచ్చారు.

## ఫైర్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన



**అక్షరటుడే, బాల్కొండ:** అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాల్కొండ మండల ఫైర్ సేఫ్టీ అధికారి శేఖర్ సూచించారు. బాల్కొండ అగ్నిమాపక కార్యాలయంలో మంగళవారం కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఫైర్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాద సమయంలో వ్యవహరించాల్సిన విధానాలను విద్యార్థులకు వివరించారు. పెద్దఎత్తున అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు వెంటనే 112 లేదా 101 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని శేఖర్ కోరారు. గ్యాస్ లీకైతే ఎలా వ్యవహరించాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు విఘ్నేశ్వర, ఆకుల లక్ష్మణ్, ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# 84వేలకు పైగా ఓట్లు ఔట్..

జిల్లాలో ఓటర్ల జాబితా సరళీకరణ ప్రక్రియ పూర్తయింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు ముసాయిదా ఓటర్ల జాబితాను సోమవారం విడుదల చేశారు. దీంట్లో 84వేలకు పైగా ఓట్లు ఎలాంటి ఆధారాలు లేనందున తొలగించారు.

- అక్షరటుడే, ఎల్లారెడ్డి

■ కామారెడ్డి జిల్లాలో 'సర్' ఎఫెక్ట్.. ■ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసిన అధికారులు ■ 6.11 లక్షలకు చేరిన ఓటర్లు ■ 15 రోజులు అభ్యంతరాలకు అవకాశం

గత ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో 84,268 నుంచి 84,438 వరకు ఓట్లు తగ్గాయి. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 6,11,738 మంది ఓటర్లు ఉన్నారు. అయితే ఓట్లు తగ్గడంపై ఎన్నికల సంఘం అధికారులు క్లారిటీ ఇచ్చారు. 'సర్' ప్రక్రియలో భాగంగా 21,355మంది చనిపోయిన ఓట్లను తొలగించారు. అలాగే 30,532మంది ఓటర్లు వలస వెళ్లినట్లుగా గుర్తించారు. 18,587మంది ఓట్లు డబుల్ ఎంట్రీలుగా తేలాయి. అలాగే 7,986 మంది ఓటర్లను అర్హత లేనివారిగా గుర్తించి తొలగించారు. అలాగే 18 ఏళ్లు నిండిన 1,65,608 మంది కొత్త యువ ఓటర్లను జాబితాలో చేర్చారు.

### కామారెడ్డి నియోజకవర్గంలో..

కామారెడ్డి నియోజకవర్గంలో 271 పోలింగ్ కేంద్రాలు ఉండగా 2,18,993 ఓటర్లను గుర్తించారు. 41,903 ఓట్లు తొలగించబడ్డాయి. అలాగే ఎల్లారెడ్డిలో 283 పోలింగ్ కేంద్రాలుండగా.. 2,06,084 మందిని గుర్తించి 22,463 ఓట్లను తొలగింపజేశారు. జుక్కల్‌లో256 కేంద్రాలు ఉన్నాయి. అందులో 1,86,311మందిని గుర్తించి 20,072 మంది ఓట్లను తొలగించారు. జిల్లామొత్తంలో 810 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 6,11,738 ఓటర్లుగా గుర్తించి..84,438ని తొలగించారు. ఇందులో పురుషులు 3,14,179 మంది ఉండగా మహిళలు 2,96,936 మంది ఉన్నారు. ఇతరులు 23మంది ఉన్నారు.

### నిజామాబాద్ జిల్లాలో..

ఆర్మూర్ నియోజకవర్గంలో మొత్తం 2,15,186 ఓట్లు ఉండగా 25,729 ఓట్లను తొలగించారు. ప్రస్తుతం 1,89,457ఓటర్లు ఉన్నారు. అలాగే బోధన్‌లో 2,23,152ఓట్లు ఉండగా.. 27,808ఓట్లను తొలగించారు. మొత్తంగా 1,95,344మంది నియోజకవర్గంలో ఉన్నాయి. బాన్సువాడలో ,96,331ఓటర్లు ఉండగా.. 19,882 ఓట్లను తొలగించారు. 1,76,449మంది ఓటర్లు బాన్సువాడలో ఉన్నారు. అలాగే నిజామాబాద్ అర్బన్‌లో 3,08,261ఓట్లు ఉండగా.. 53,283మంది ఓటర్లను తొలగించారు. దీంతో 2,54,978 మంది ముసాయిదా జాబితాలో ఉన్నారు. నిజామాబాద్ రూరల్‌లో 2,64,723ఓటర్లు ఉండగా 31,145ఓట్లను తొలగించారు. ఫైనల్‌గా 2,33,578మంది ఉన్నట్లుగా తేల్చారు.

### కార్యాలయాల్లో ప్రదర్శన..

పారదర్శకత కోసం ముసాయిదా జాబితాను తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో 810 పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించారు. అభ్యంతరాలకు 15 రోజుల గడువు ఇచ్చారు. జాబితాలో పేరు లేకపోతే, తప్పుగా తొలగించారని భావిస్తే వెంటనే అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యంతరాలను పరిశీలించిన తర్వాతే తుది జాబితాను ప్రచురిస్తారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోలీసులకు వైద్య పరీక్షలు

**అక్షరటుడే, బాల్కొండ :** మండలంలోని పోలీస్ స్టేషన్‌లో బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోలీసులకు మంగళవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కిసాన్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్య సిబ్బంది వీరయ్య గౌడ్, రమేష్ ఆధ్వర్యంలో బాల్కొండ, ముప్కాల్ పోలీస్ స్టేషన్లకు చెందిన సిబ్బందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. పోలీసుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి చాకు లింగం, అధ్యక్షుడు యాదగిరి గౌడ్, హెడ్ కానిస్టేబుళ్లు శేఖర్, విఠల్, గణపతి పాల్గొన్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా నిర్మల్ ఇన్‌ఛార్జీగా స్వామి యాదవ్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బీజేపీ ఓబీసీ మోర్చా నిర్మల్ ఇన్‌ఛార్జీగా ఇందూరు చెందిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మదాసు స్వామి యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ నియామకపత్రాన్ని అందజేశారు. స్వామి యాదవ్ మాట్లాడుతూ తనకు రాష్ట్ర నాయకత్వం అందించిన నూతన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. నిర్మల్ జిల్లాలో బీసీ సమాజాన్ని ఏకంచేసి బీసీల హక్కుల కోసం నిరంతర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జీగా తనకు ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యకుడు ఆనంద్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



నగరంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..



బాల్కొండలో..



నందిపేట్‌లో..

## బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్..

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజన ధీరత్వానికి ప్రతీక అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. నగరంలోని వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద విగ్రహాల పార్క్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



ఎల్లారెడ్డిలో..



నాగిరెడ్డిపేటలో..



డొంకేశ్వర్‌లో..

## పారిశుధ్య పరిరక్షణకు దుకాణాదారులు సహకరించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలో పారిశుధ్య పరిరక్షణకు ప్రతి దుకాణ యజమాని సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ కోరారు. దుకాణాల పరిసరాలను ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దుకాణాల ముందు చెత్తాచెదారం, ప్లాస్టిక్, ఆహార వ్యర్థాలను వేయకుండా చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. దుకాణాల ముందు మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు డ్రైనేజీ కాలువల్లో చెత్త, ప్లాస్టిక్ కవర్లు వేయరాదన్నారు. ముఖ్యంగా ఆహార పదార్థాలు విక్రయించే దుకాణాల యజమానులు పరిశుభ్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ సూచించారు. పట్టణ పారిశుధ్య పరిరక్షణ మున్సిపాలిటీ ఒక్కదాని బాధ్యత కాదని, వ్యాపారులు, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. పరిశుభ్రమైన వాతావరణంతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## గాంధారిలో సుభాష్ చంద్రబోస్ వర్ధంతి



**అక్షరటుడే, గాంధారి:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం గాంధారి మండల శాఖ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షులు చీమలవార్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేతాజీ అనేక కష్టాలను ఎదుర్కొని ఆజాద్ హింద్ ఫౌజ్ ను ఏర్పాటు చేశారన్నారు. 'మీరు నాకు రక్తం ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను' అనే నినాదంతో యువతలో దేశభక్తి రగిలించారన్నారు. తన ప్రాణాలను కూడా దేశం కోసం పణంగా పెట్టారని గుర్తు చేశారు. నేతాజీ త్యాగమే ఈరోజు మనం స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోవడానికి కారణమని, ఆయన చూపిన మార్గంలో నడవడమే మనందరి బాధ్యత అని అన్నారు. ఉపాధ్యక్షులు దోల్లు లక్ష్మణ్, జాయింట్ సెక్రెటరీలు నస్కంటి రవి,సామల రాజు, వంజరి రాకేష్, సిందే నితిన్, ఆరె కటిక మోతిలాల్, ఆకుల రాకేష్, ఎండ్రియాల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం కాంగ్రెస్‌తోనే సాధ్యం



**అక్షరటుడే, ఆర్మూర్:** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆలూర్ సర్పంచ్ ముక్కెర విజయ్ అన్నారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో 34 ఇళ్లు మంజూరు కాగా, మంగళవారం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి కృషితో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. పథకం కింద ప్రభుత్వం నిర్ణయించిన విధంగా దశలవారీగా నిధులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు నారాయణ, చిరంజీవి, భాస్కర్, మహేష్, ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వైస్ మల్లారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు ఉదయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముత్యం రెడ్డి, నవనీత్ ,బీరయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.